సాక్షి
ప్రకాశం
మంగళవారం | 27 | జూన్ | 2023



భక్తుల కొంగుబంగారం పాలంక

నల్లమలలో ఉన్న పాలంక వీరభద్రస్వామి తిరునాళ్ల నేటి నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్నారు. - 8లో..



మాదకద్రవ్యాలతో పెనుముప్పు

మాదకద్రవ్యాలను తీసుకుంటే జీవితాలు నాశనమవుతాయని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. ఒంగోలులో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పీఎం ఆవాస్ యోజన గృహాలను త్వరగా ప్రారంభించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ప్రధానమంత్రి అవాస్ యోజన గ్రామీణ్ పథకం కింద నిర్మించే గృహాలను జూన్ 30వ తేదీ నాటికి తప్పనిసరిగా ప్రారంభించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో ఎంపీడీవోలు, హౌసింగ్ ఈఈ, డీఈఈ, ఏఈఈలతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద బేస్‌మెంట్ నిర్మించుకునేందుకు రూ.40 వేలు ప్రభుత్వం అడ్వాన్స్‌గా ఇస్తుందన్నారు. ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూలై చివరికి 5 లక్షల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో 17,604 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 14,668 ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 2,936 ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నీ గృహాలకు ప్రతి దశలో రూ.20 వేలు అడ్వాన్స్ నగదును లబ్ధిదారులకు అందచేస్తుందన్నారు. ఎంపీడీవోలు, మండలంలోని గృహ నిర్మాణాలకు సంబంధించి అధికారులు ప్రతి బుధవారం సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ పేరయ్య పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాలతో ఆర్యవైశ్యులను విడగొట్టే యత్నం

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్



మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్

ఒంగోలు టౌన్: ఒంగోలులో ఆర్యవైశ్యులు అన్నాదమ్ముల్లా కలిసి మెలసి జీవిస్తుంటారని, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వారిని విడగొట్టే దుష్ట యత్నాలు చేయవద్దని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ హితవు పలికారు. ఒంగోలులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒంగోలు బాపూజీ మార్కెట్ వద్ద ఏర్పాటు చేయనున్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. సొంత గ్రామంలో రోశయ్య విగ్రహం ఏర్పాటును వ్యతిరేకిస్తూ కోర్టుకెక్కిన రాకేష్ లాంటి వాళ్లు ఇక్కడికి వచ్చి మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. ఈబీసీ కింద 60 వేల మంది ఆర్యవైశ్యులకు సహాయం అందించారని, విదేశీ విద్య విషయంలో ఎంతో మంది ఆర్యవైశ్య విద్యార్థులు లబ్ధి పొందారని తెలిపారు. రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న జగనన్న ప్రభుత్వం గురించి దుష్ప్రచారం చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వాసవీ ఆరామ క్షేత్రం అధ్యక్షుడు మునగ కృష్ణారావు, ఆర్యవైశ్య నాయకులు మట్టరాజ, సింగరకొండ బోర్డు పబ్బిశెట్టి శ్రీను, వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చీదెళ్ల వేణుగోపాల్, వీరాంజనేయ స్వామి దేవస్థానం సభ్యులు కోట రాంబాబు, కిరణ్, ఆర్యవైశ్య సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు హరీష్ హరి, జొన్నలగడ్డ వంశీ పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల సిబ్బంది బదిలీలు



బదిలీ ఉత్తర్వులు అందిస్తున్న నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మున్సిపాలిటీల్లో వార్డు సచివాలయ సిబ్బంది బదిలీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బదిలీ అయిన ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ జీఎస్‌డబ్ల్యూఎస్ ఆదేశాల మేరకు వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియను ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో చేపట్టామన్నారు. ముందుగా ఆన్‌లైన్‌లో బదిలీల కోసం చేసుకున్న అభ్యర్థనల మేరకు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ కేవీ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేతన్నలు మెరిసేలా..

అందమైన రంగులు..ఆకట్టుకునే జరీ అంచులు.. చూపుల్ని కట్టిపడేసే అందమైన డిజైన్లు మన చేనేతల సొంతం. అగ్గిపెట్టెలో పట్టేంత చీరలు నేసిన ఘనత మన నేతన్నలది.. దారం దారం పోగుచేసి అద్భుతమైన చీరలను అందించిన కీర్తి మనది. శతాబ్దాల చరిత్ర కలిగిన చేనేత రంగాన్ని గత పాలకులు నిర్లక్ష్యంతో నిర్వీర్యం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేనేత రంగానికి చేయూతనిచ్చారు. నేతన్న బతుకులు మెరిసేలా భరోసానిస్తున్నారు.

- చేనేతలకు అండగా జగనన్న చేయూత
- ఆర్థికంగా బలపడేందుకు ఒక్కొక్కరికి రూ.24 వేలు అందజేత
- నాలుగు విడతలుగా రూ.6 కోట్ల మేర లబ్ధి
- 5వ విడత పంపిణీకి రంగం సిద్ధం
- 20వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూలై మొదటి వారంలో తుది జాబితా ఖరారు
- కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా మౌలిక వసతుల కల్పన
- జిల్లాలో 16 సొసైటీల్లోని సభ్యులకు ప్రభుత్వం అండదండలు



చేనేత మగ్గం

చీమకుర్తి:

నిర్వీర్యమవుతున్న చేనేత రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూతనిచ్చారు. చేనేత కార్మికుడు నిలదొక్కుకునేందుకు కుటుంబం ఆర్థికంగా బలపడేందుకు ప్రతి ఏడాది నేతన్న నేస్తం పేరుతో ఒక్కో మగ్గం నిర్వాహకుడికి రూ.24 వేలు వంతున అందజేసి ప్రభుత్వం అండగా నిలిచింది. అది కూడా ఎప్పుడో ఎన్నికలు వస్తాయనే ముందు కాకుండా అధికారంలోకి వచ్చిన నాలుగైదు నెలల్లోనే మొదటి విడతగా 2019-20 లో దాదాపు 600 మందికి ఒక్కొక్కరికి రూ.24 వేలు వంతున సీఎం బటన్ నొక్కి చేనేత లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులను జమచేశారు. అది వరుసగా 2020-21లో రెండో విడత, 2021-22లో మూడో విడత కూడా అందజేశారు. ఇక నాలుగో విడత జిల్లాలోని 12 మండలాల్లోని 667 మంది లబ్ధిదారులకు రూ.1.60 కోట్ల మేరకు ప్రయోజనం చేకూరింది. కొత్తపట్నం మండలంలో 231 మందికి, కనిగిరిలో 163, పీసీపల్లిలో 76, బేస్తవారిపేటలో 76, నాగులుప్పలపాడు 73, ఇంకా చీమకుర్తి, ఒంగోలు, మద్దిపూడి, సీఎస్‌పురం, పామూరు, మార్కాపురం తదితర మండలాల్లోని చేనేతలకు లబ్ధి చేకూరింది. ఈ పథకంలో ఇప్పటి వరకు జిల్లాలో నాలుగు దఫాల్లో కలిపి 2,500 కుటుంబాలకు రూ.6 కోట్ల మేరకు ఆర్థిక ప్రయోజనం చేకూరింది.

కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా మౌలిక వసతుల కల్పన:

చేనేత కార్మికులు తమ మగ్గాల ద్వారా ఉపాధిని మెరుగుపరచుకోవడం కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా మగ్గాలకు కావాల్సిన కనీస మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా ఈతముక్కల, కనిగిరి పాపాయి పల్లె, బేస్తవారిపేటలలో కామన్ ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసింది. చేనేత కార్మికులు వీవింగ్, డైయింగ్, డిజైనింగ్‌లలో ప్రత్యేక శిక్షణను ప్రత్యేక నిపుణుల ద్వారా ఇప్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచటంలో కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఉపయోగపడుతున్నాయి. వాటితో పాటు వ్యక్తిగతంగా చేనేత కార్మికుడు తన ఇంట్లోనే మగ్గం పనిలో నైపుణ్యతను సాధించటం, ఇంట్లోనే ఉండి నేత నేయటానికి అనుకూలంగా ఉండేందుకు వర్క్‌షెడ్‌లను కూడా ఏర్పాటు చేసింది. ఒక్కో వర్క్‌షెడ్‌ను రూ.1.20 లక్షలతో ఇప్పటి వరకు జిల్లాలో 20 మందికి నిర్మించారు. 100 శాతం సబ్సిడీతో వర్క్‌షెడ్‌లను నిర్మిస్తుండటంతో చేనేత కార్మికులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలిచిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాటితో పాటు నేతన్న కార్మికులు నాణ్యమైన ప్రమాణాలను పొందటం, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకునేందుకు బ్యాంక్‌ల ద్వారా ముద్ర రుణాలను కూడా ఒక్కో వ్యక్తికి రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు అందిస్తోంది.

ఐదో విడతకు సిద్ధం..

తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరం 5వ విడత మళ్లీ నేతన్న నేస్తం అందించేందుకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో 5వ విడతకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ఖరారు చేస్తారు. నేతన్న నేస్తం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు నిస్తేజంగా మగ్గాలను మూసేసుకుందామనుకున్న దశలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పేరుతో ఆదుకోవడంతో చేనేత కార్మికులకు ఊపిరిపోసినట్లయింది. జిల్లాలో 16 చేనేత సొసైటీలలోని సభ్యులంతా తమ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి తోడ్పడిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మగ్గాన్ని పరిశీలిస్తున్న చేనేత జౌళి శాఖ ఏడీ బీ.ఉదయ్‌కుమార్

నేతన్న నేస్తం 5వ విడత పంపిణీకి రంగం సిద్ధం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్న నేస్తం పథకం ద్వారా ఒక్కొక్క మగ్గం లబ్ధిదారుడికి రూ.24 వేలు అందిస్తుంది. నాలుగు విడతలుగా జిల్లాలోని నేతన్నలకు 'నేతన్న నేస్తం' ద్వారా ఆర్థిక సాయం చేశాం. 2023-24 ఆర్థిక సంవత్సరం 5వ విడత పంపిణీకి అర్హులైన చేనేత కార్మికుల నుంచి ఈనెలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులైన వారిని వచ్చే నెల మొదటి వారంలో ఫైనల్ చేసిన ప్రభుత్వానికి పంపుతాం. ఆగస్టులో పంపిణీ చేసే అవకాశం ఉంది.

– బీ.ఉదయ్‌కుమార్, ఏడీ, చేనేత, జౌళి శాఖ, ఒంగోలు

చేనేత కుటుంబాలకు అండగా నిలిచిన నేతన్న నేస్తం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తం పేరుతో ఇస్తున్న ఆర్థిక సహకారం చేనేత కార్మికులు ఆర్థికంగా బలపడేందుకు దోహదపడింది. ఒక్కొక్క మగ్గం యజమానికి రూ.24 వేలు వంతున నేతన్న నేస్తం పేరుతో నేరుగా ఖాతాల్లో వేస్తున్నారు. మగ్గాల మీద ఆధారపడిన వారికి ఊపిరిపోసినట్లయింది.

– కోటా రాములు, చీమకుర్తి

విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- వారం రోజుల పాటు వారోత్సవాల నిర్వహణ
- విద్యుత్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ ఇన్‌స్పెక్టర్ టి.ఎక్స్.అజయ్ కుమార్

ఒంగోలు సబర్బన్: విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, తద్వారా విద్యుత్ ప్రమాదాల నుంచి బయట పడాలని విద్యుత్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ ఇన్‌స్పెక్టర్ టీ.ఎక్స్.అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 2వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు విద్యుత్ వినియోగ సమయంలో మెళకువలు పాటించాలన్నారు. నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడాలన్నారు. విద్యుత్ వినియోగంలో అవగాహనా లోపం లేకుండా చూసుకోవాలని వెల్లడించారు. మేలు రకమైన విద్యుత్ పరికరాలు వినియోగించాలని సూచించారు. జిల్లాలో విద్యుత్ ప్రమాదాల వలన 25 మంది ప్రాణాలు కోల్పోయారని, 28 పశువులు, మేకలు మృతి చెందాయని వెల్లడించారు. వర్షాలకు వచ్చిన విపరీతమైన గాలులు, వర్షాలకు విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయన్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియజేయాలన్నారు.

డిగ్రీ ప్రవేశాల గడువు జూలై 5 వరకు పొడిగింపు

ఒంగోలు: 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు జూలై 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో ప్రస్తుతం పరిశీలన జరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థుల మొబైల్స్‌కు సమాచారం వస్తుందన్నారు. ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు ఉన్నట్లు సమాచారం వచ్చినవారు మాత్రమే ఒంగోలు సహాయ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. జూలై 7 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకునేందుకు, జూలై 16వ తేదీ సీట్ల కేటాయింపు, జూలై 17న తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9490774225 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జగనన్నది ఆదర్శవంతమైన పాలన

- గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర పురపాలక శాఖమంత్రి ఆదిమూలపు సురేష్
- సుద్దకురవ తండాలో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. మండలంలోని సుద్దకురవతండాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా తండాలో రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం మంత్రి సురేష్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధిచేకూరిందో వివరించారు. మంత్రి సురేష్‌కు గిరిజనులు పూలతో ఘన స్వాగతం పలకారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు సర్వహక్కులు కల్పిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలకు రైతు భరోసా, బ్యాంకులో రుణాలు ఇప్పించిన ఘనత జగనన్నదే అని చెప్పారు. నూతనంగా జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామాల్లోని ప్రజలకు త్వరిత గతిన పత్రాలను అందచేసేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో పగటివేషగాళ్లు ఎక్కువయ్యారని, ప్రజలకు మాయ మాటలు చెప్పి బురిడీ కొట్టించేందుకు వస్తున్నారని, వారి మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఈ రోజు రాష్ట్రంలో గిరిజనుల పిల్లలు ఎక్కువగా ఉద్యోగాలు చేస్తున్నారంటే అది జగనన్న చలువే అని అన్నారు. రాష్ట్రం ప్రజలు జగనన్నకు అండగా ఉన్నారని, ఎవరు వచ్చినా మళ్లీ జగనన్న సీఎం కావడం తథ్యం అన్నారు. తండాలోని గిరిజనులు పలు సమస్యలు విన్నవించారు. ఇళ్ల స్థలాలు కావాలని, గ్రామంలో ఉండే విద్యుత్ తీగెలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ లాజర్, పార్టీ మండల అధ్యక్షుడు రెంటపల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరనాయక్, సచివాలయ మండల కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, తహశీల్దార్ దాసు, డీఎల్‌డీవో సాయికుమార్, ఈవో పీఆర్డీ బాలునాయక్, ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిర, ఎంఎల్‌ఓ వాసు తదితరులు పాల్గొన్నారు.

వృత్తిలో స్థిరపడేందుకు వైఎస్‌ఆర్ లా నేస్తం



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్

- యువ న్యాయవాదులకు ఎంతో ఉపకరం
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: వృత్తిలో స్థిరపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ లా నేస్తం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం వీడియో సమావేశం ద్వారా లా నేస్తం పథకాన్ని ప్రారంభించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, డీఆర్‌ఓ శ్రీలత పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లా నేస్తం యువ న్యాయవాదులకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు మూడేళ్ల పాటు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు రెండు విడతలుగా నగదును నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 355 మంది లబ్ధిపొందుతున్నట్లు చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మొదటి మూడు సంవత్సరాల్లో వృత్తిలో నిలబడేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంచి ఆలోచనలతో అన్నీ వర్గాలకు మేలు జరిగేలా లా నేస్తం పథకం ప్రారంభించి చేయూతనిస్తున్నారన్నారు. ప్రభుత్వ సహకారాన్ని అందుకుని యువ లాయర్లు మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ లా నేస్తం ద్వారా లబ్ధి పొందిన లాయర్లు ఉన్నత స్థానాలకు ఎదిగి పేదలకు సేవలందించాలని కోరారు. జూనియర్ న్యాయవాది నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ప్రతి నెలా రూ.5 వేలు అందించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ఈ నగదు లా పుస్తకాలు కొనేందుకు, ప్రాక్టీసు చేసేందుకు బాగా ఉపకరిస్తుందన్నారు. వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఈ నగదు ప్రోత్సాహం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు లాయర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

స్పందన అర్జీలు పునరావృతం కారాదు

- ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీల తాలూకు సమస్యలు పునరావృతం కాకూడదని, సమస్యలను క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల నుంచి ఫోన్‌లో సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, ఉమాదేవి, చెన్నయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

■ సింగరాయకొండ మండలం కనుమళ్ల గ్రామానికి చెందిన గురుబ్రహ్మరెడ్డి స్పందనలో కలెక్టర్‌ను కలిసి తన భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. సర్వే నంబర్ 382లో 3.89 ఎకరాల భూమి ఉందని, దానిలో కొంత నేషనల్ హైవే కింద తీసుకున్నారని తెలిపారు. మిగిలిన భూమి కూడా ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా ఉందని, సబ్ డివిజన్ చేసి తన పేరుతో ఆన్‌లైన్ చేసి పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరాడు.

■ సంతనూతలపాడు మండలం ఎం.వేములపాడు గ్రామానికి చెందిన వలేటి పిచ్చయ్య స్పందనలో అధికారులను కలిసి తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. తనకు 60 ఏళ్ల వయసు ఉందని, అయినా పింఛన్ రావడం లేదని, పరిశీలించి న్యాయం చేయాలని కోరాడు.

■ కొమరోలు మండలం దొడ్డవాడ గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి పంచాయతీ సెక్రటరీ తమ గ్రామంలో బోరు వేయకపోయినా వేసినట్లు చూపారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.

■ పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన నరసింహారావు గ్రామంలో 15 రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడంలేదని, అధికారులు స్పందించడం లేదని ఫిర్యాదు చేశాడు. సమస్య పరిష్కరించి తాగునీటిని అందించాలని కోరాడు.

బాతు హేచరీస్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ: మండలంలోని కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్లలో సోమవారం సాయంత్రం సెర్ప్, పీఎంఈజీపీ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేసిన 11 డక్ హేచరీస్ యూనిట్లను, రెండు మినీ ట్రక్కులను ప్రారంభించారు. సెర్ప్ సీఈవో ఇంతియాజ్, కలెక్టర్ దినేష్ కుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రతి వలంటీర్ ఇంటికి వచ్చి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రజలకు ప్రభుత్వం నుంచి ఏ పథకాలు వస్తాయో తెలిసేది కాదని, కానీ గ్రామ వలంటీర్ వ్యవస్థ కారణంగా నేడు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలపై అవగాహన ఏర్పడిందని, ఇది జగనన్న కృషే అని కొనియాడారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి చెక్కులను, డ్వాక్రా గ్రూపులకు ఇచ్చిన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. సర్పంచ్ చిడిపూడి వెంకటరత్నం, ఎంపీపీ కట్టా శోభారాణి, స్త్రీనిధి ఎండీ వీ నాంచారయ్య, ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ, డీఐసీ జీఎం బీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండయ్య, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, డీఆర్‌డీఏ పీడీ బీ బాబూరావు, ఏసీ పీ సనిత, ఏపీఎం డీ జయరాజ్, తహశీల్దార్ సీహెచ్ ఉష, ఎంపీడీవో షేక్ జమీఉల్లా, కనుమళ్ల పీఏసీఎస్ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు పాల్గొన్నారు.



హేచరీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సెర్ప్ సీఈఓ, ఇంతియాజ్, కలెక్టర్ దినేష్ కుమార్

క్లుప్తంగా

షాపింగ్ కాంప్లెక్స్‌లలో రిజర్వేషన్ కల్పించాలి

● మంత్రి సురేష్‌కు దివ్యాంగుల వినతి



దివ్యాంగులతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి సోమవారం రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు స్థానిక క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, అలాగే కొన్ని పంచాయతీల్లో అర్హత ప్రామాణికంగా దివ్యాంగులకు షాపులు కేటాయించాల్సి ఉన్నా జీఓలను పక్కన పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి.. ప్రభుత్వ జీఓ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల బాధ్యులు పి.శ్యాం, ముల్లా మదార్‌వలి, మహి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య విద్య అందించండి

● మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాలలో మెరుగైన వైద్య విద్య అందించి మంచి వైద్యులు సమాజంలోకి వచ్చేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబుకు సూచించారు. ఇటీవల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్ బాబు సోమవారం ప్రకాశంభవనంలో మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య కళాశాలలో మంచి విద్యను అందించి మంచి పేరు తీసుకురావాలన్నారు. వైద్య విద్యతో పాటు వివిధ అంశాల్లో విద్యార్థులు రాణించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డాక్టర్ తిరుమలరావు, రాజమణి తదితరులు ఉన్నారు.

భక్తుల కొంగు బంగారం పాలంక

పచ్చటి వృక్షాలతో దట్టమైన అడవి, పెద్ద కొండ చరియ పైనుంచి జాలువారే జలపాతం, ప్రకృతి రమణీయతకు ఆలవాలంగా నిలుస్తుంది పాలంక క్షేత్రం. ఇక్కడ ఆదిశేషుని ఆకారంలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొండచరియ కింద మూలవిరాట్ పాలంకేశ్వరుడితో పాటు వీరభద్రుడు, గణపతి, పంచముఖ బ్రహ్మ, పోతురాజుల ఆలయాలు, పది అడుగుల ఎత్తున్న నాగమయ్య పుట్ట కొలువై ఉన్నాయి. మంగళవారం నుంచి 29వ తేదీ వరకు వీరభద్రస్వామి తిరునాళ్ల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం

- వీరభద్రస్వామిని పూజిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మకం
- ప్రకృతి రమణీయతకు నెలవు పాలంక క్షేత్రం
- నేటి నుంచి 29వ తేదీ వరకు తిరునాళ్లకు ఏర్పాట్లు సిద్ధం
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు



పాలంక వీరభద్ర స్వామి, భద్రకాళి అమ్మవార్లు



పాలంక వీరభద్రస్వామి క్షేత్రం

యర్రగొండపాలెం: దట్టమైన నల్లమల అడవిలో, కృష్ణానది ఒడ్డున పాలంక వీరభద్రస్వామి కొలువై ఉన్నాడు. స్వామి కరుణ కోసం వేలాది మంది భక్తులు కాలినడకన, ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్తారు. ప్రకాశం జిల్లాతో పాటు గుంటూరు, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు పాలంకకు చేరుకుంటారు. సంతాన ప్రాప్తి కోసం భక్తులు నల్లమల అడవుల్లోని పాలంక వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శిస్తారు. ఇక్కడి పెద్ద కొండచరియపై నుంచి పంచలింగాలపై జాలువారే నీటి బిందువుల కోసం సంతానం లేని దంపతులు దోసిళ్లు పడతారు. అలా దోసిళ్లపై నీటి బిందువులు పడిన దంపతులకు సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

గత వైభవానికి ప్రతీక పాలంక క్షేత్రం

గత వైభవానికి ప్రతీకగా నిలిచిన పాలంక క్షేత్రం యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రి పాలెం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి పాలంక చేరుకునేందుకు 40 కిలో మీటర్ల మేర యాత్ర సాగించాలి. దట్టమైన నల్లమల అడవుల్లో ఆకాశాన్ని అంటే కొండల్లో నుంచి సాగే ఈ భక్తిరస యాత్ర ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. విజయనగర సామ్రాజ్యాధీశుడైన శ్రీకృష్ణదేవరాయలు పాలన వైభవానికి చెరిగిపోని జ్ఞాపకంగా పాలంక క్షేత్రం నిలుస్తుంది.

నల్లమల అందాలకు ముగ్ధుడైన పరమశివుడు!

పాలుట్ల గిరిజన గూడేనికి పది కిలోమీటర్ల దూరంలో పాలంక క్షేత్రం కొలువై ఉంది. పచ్చటి వృక్షాలతో దట్టమైన అడవి, పెద్ద కొండ చరియ పైనుంచి దూకే జలపాతం మైమరిపిస్తాయి. నల్లమల అందాలకు పరమశివుడు ముగ్ధుడై పూజలందుకునేందుకు ఇక్కడ వెలిశాడని భక్తుల విశ్వాసం. స్వామివారిని ఇక్కడ పాలంకేశ్వరుడిగా పిలుస్తారు. శ్రీశైల క్షేత్రానికి సమీపంలో గల ఈ ఆలయంలో ఆరోగ్య, సౌభాగ్య, సంతాన ప్రదాత వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లు కొలువై ఉన్నారు. 'పర్వతాల మల్లయ్య, పాలంక వీరయ్య' అంటూ భక్తులు పాడుకునే జానపద గేయాల ద్వారా ఈ క్షేత్రం శ్రీశైలంతో పోల్చబడింది. ఏటా ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పాలంక ఉత్సవం నిర్వహిస్తారు.

భక్తుల పాలిట కొంగు బంగారం

సంతాన ప్రాప్తి కోసం భక్తులు అధిక సంఖ్యలో ఈ క్షేత్రాన్ని దర్శిస్తుంటారు. ఇక్కడి కొండ పైనుంచి పంచలింగాలపై జాలువారే నీటి బిందువుల కోసం సంతానం లేని దంపతులు దోసిళ్లు పడతారు. అలా దోసిళ్లలో నీటి బిందువులు పడిన దంపతులకు సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

శ్రీకృష్ణదేవరాయల వారి రక్షణ

శ్రీశైలం క్షేత్రంతో విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయలకు ఎంత అనుబంధం ఉందో అంతే అనుబంధం పాలంక క్షేత్రంతోనూ ఉంది. రాయలవారు తూర్పు దండయాత్రల సందర్భంగా గజపతులను ఓడించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించారు. అలా కృష్ణానది ఒడ్డున ప్రయాణం సాగిస్తుండగా ప్రజలు దారిదోపిడీ దొంగల నుంచి తమను కాపాడాలని వేడుకున్నారు. అప్పుడు తన సైన్యాధిపతులైన బోడా వెంకటపతినాయుడు, నలగాటి పెద్ద తిమ్మ నాయుడుకు ఈ ప్రాంతాన్ని జాగీరుగా ఇచ్చి నది పక్కన ఆలాటం కోటను నిర్మించారు. అక్కడి నుంచి ఆరు కిలో మీటర్ల దూరంలో పాలంక వీరభద్రుడు, భద్రకాళీ మాతను ప్రతిష్ఠించి ఆ ప్రాంతానికి రక్షణ బాధ్యతను తన సైన్యాధిపతులకు అప్పగించారని చరిత్ర చెబుతోంది.

వివాహేతర సంబంధంతోనే హత్య..?

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో సంజీవయ్య హత్య వివాహేతర సంబంధంతోనే జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. గ్రామంలో పశువుల దళారీగా జీవనం కొనసాగించే సంజీవయ్యకు అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉండటంతో.. సదరు మహిళ భర్త సంజీవయ్యపై కర్ర, రాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య



రైలు పట్టాలపై యువకుని మృతదేహం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల సమీపంలో గుర్తుతెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..30 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైలు పట్టాలపై మృతదేహాన్ని గమనించిన స్థానికులు నంద్యాల జీఆర్‌పీఎఫ్‌కు సమాచారం అందించారు. జీఆర్‌పీఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీటి వనరులు పెంపొందించేందుకే వాటర్‌షెడ్లు

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



రామసముద్రంలో తైవాన్‌స్ప్రేయర్లు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: మెట్ట ప్రాంతంలో నీటి వనరులు పెంపొందించి సాగునీటిని అందించేందుకు వాటర్‌షెడ్లతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని రామసముద్రంలో పీఎంఎస్‌కేవై వాటర్‌షెడ్ పథకం కింద రైతులకు మంజూరైన తైవాన్‌స్ప్రేయర్లు, డ్రిప్ ఇరిగేషన్ పైపులు, టార్పాలిన్ పట్టలను సోమవారం మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటర్‌షెడ్ పథకానికి అవసరమైన నిధులు సమకూర్చాయన్నారు. ఐదేళ్లలో రూ.11 కోట్లను వాటర్‌షెడ్లకు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వాటర్‌షెడ్ దిగువన రామసముద్రం, మిట్టపాలెం, లేళ్లపల్లి, దువ్వలి, విశ్వనాథపురం గ్రామాలకు చెందిన 8 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. రైతులకు రూ.68 లక్షల విలువైన తైవాన్‌స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు, పైపులను 80 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. త్వరలో వెలిగొండ రెండు సొరంగాలు పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించేందుకు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. మిట్టపాలెం, రామసముద్రం, త్రిపురాంతకం చెరువులకు నీరందించే చాపలమడుగు సప్లై చానల్‌ను గ్రామస్తులు కోరుతున్న నేపథ్యంలో ప్రతిపాదనలు తయారు చేయించి నిధుల కోసం త్వరలో సీఎంను కలుస్తానని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి సంక్షేమ, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వానికి అందరూ మద్దతు పలకాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబాన్ని కలుస్తామన్నారు. ఈయన వెంట వాటర్ షెడ్ పీఓ సమ, జేఈ సుధాకర్, టీఓ శ్రీను, ప్రసాద్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్ సుశీల, వెంకట పిచ్చయ్య, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్ రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ ఎం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఏసోబు, ఇతర నేతలు పాల్గొన్నారు.

108లో ప్రసవం

● తల్లీబిడ్డ సురక్షితం



శిశువును చూపుతున్న 108 సిబ్బంది

కొనకనమిట్ల: పురిటినొప్పులతో బాధ పడుతున్న మహిళకు 108 అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. మండలంలోని వెలిగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన ఉప్పలపాటి ఆదిలక్ష్మికి సోమవారం పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది గాలిరెడ్డి, శివకుమార్, దుర్గాప్రసాద్ ఎస్సీ కాలనీకి చేరుకుని ఆదిలక్ష్మిని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపి ప్రసవం చేశారు. ఆదిలక్ష్మి పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలతో పెను ముప్పు

- డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన సదస్సులో ఎస్పీ మలికా గర్గ్
- చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచన
- ఒంగోలు నగరంలో విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: మాదకద్రవ్యాలను సేవించడం వల్ల జీవితాలు నాశనమవుతాయని, సమాజంలో గౌరవం కోల్పోతారని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి లాంటి మత్తు పదార్థాలను సరదాకు కూడా ప్రయత్నించరాదని, దానికి బానిసలైతే బయటపడలేక ఇబ్బంది పడతారన్నారు. కొత్త పరిచయాలతో కొందరు యువకులు డ్రగ్స్ సేవించడం మొదలుపెడుతున్నారని చెప్పారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థపై మాదకద్రవ్యాలు తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతాయని, నరాలు దెబ్బతిని పక్షవాతానికి గురవుతారని హెచ్చరించారు. శరీరం శుష్కించి చివరికి జీవచ్ఛవంగా తయారవుతారని చెప్పారు. గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి మాదకద్రవ్యాలను విక్రయించినా, సేవించినా, రవాణా చేసినా ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒకసారి డ్రగ్స్ కేసులో పట్టుపడి పోలీసు రికార్డుల్లో పేరు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని, పాస్‌పోర్టు, వీసా కూడా పొందలేరని తెలిపారు. డ్రగ్స్ వల్ల వ్యాపారులకు మాత్రమ లాభం చేకూరుతుందని, వాటిని తీసుకున్నవారు కేసులు, శిక్షలు అంటూ జీవితాన్ని కోల్పోతారని హితవు పలికారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యంతో భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు కృషి చేయాలని సూచించారు. డ్రగ్ అడిక్షన్ నుంచి బయటపడే వారికి పోలీసు శాఖ సహాయ పడుతుందన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలను రవాణ చేస్తున్న వారి గురించి తెలిస్తే వాట్సప్ నంబరు 9121102266కు తెలియజేయాలని కోరారు.

భారీ ర్యాలీ.. మానవహారం

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఎస్పీ మలిక గర్గ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కర్నూలు రోడ్డు మీదుగా మంగమూరు జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డ్రగ్స్‌ను దరిచేరనీయమని, డ్రగ్స్ లేని సమాజం కోసం తమవంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, సెబ్ ఈఎస్ ఏ.ఆవులయ్య, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సెబ్ అధికారులు సుధీర్ బాబు, సెబ్ ట్రైనీ డీఎస్పీ సుబ్రహ్మణ్యం, సీఐలు రాంబాబు, రంగనాథ్, వంశీధర్, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు, సెబ్ సీఐ లత, ఐటీ కోర్ ఎస్సై అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో రీజినల్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

- జోన్–3లో ఉన్న గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు కలిపి రీజినల్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి
- ది కమర్షియల్ ట్యాక్స్ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్



వినతిపత్రం అందజేస్తున్న కొప్పోలు సుధాకరరావు తదితరులు

ఒంగోలు సబర్బన్: వాణిజ్య పన్నుల విభాగానికి సంబంధించి రీజినల్ ఆఫీస్‌ను ఒంగోలు కేంద్రంగా ఏర్పాటు చేయాలని ది కమర్షియల్ ట్యాక్స్ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖను సోమవారం ఒంగోలులోని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ కార్యాలయంలో ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కొప్పోలు సుధాకర రావు మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖలో గత ఏడాది జరిగిన సంస్కరణల్లో భాగంగా జోన్–3లో ఉన్న గూడూరు సర్కిల్‌ను, చిత్తూరు డివిజన్‌లోకి బదిలీ చేశారన్నారు. అదేవిధంగా అద్దంకి, వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట, మెయిన్ బజార్ (గుంటూరు), మారీస్‌పేట (తెనాలి) సర్కిళ్లను రద్దు చేశారని వివరించారు. కొత్తగా పెదకాకాని, అరండల్ పేట సర్కిళ్లను కూడా ఏర్పాటు చేశారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి జోన్–3లో 5 సర్కిళ్లను కోల్పోయామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని జోన్‌లకు రీజినల్ ఆఫీసులను ఏర్పాటు చేశారు కానీ జోన్–3కి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి రీజినల్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. జోన్–3లో సుమారు 71 మంది సీనియర్ అసిస్టెంట్లు, 41 మంది జీఎస్‌టీఓలు మిగులు సిబ్బందిగా ఉన్నారని చెప్పారు. మిగతా జోన్‌ల మాదిరిగా జోన్–3కు నూతనంగా రీజినల్ ఆఫీస్(ఆర్‌ఓ)కానీ, నూతనంగా డివిజన్ కార్యాలయం కానీ ఏర్పాటు చేయలేదని వివరించారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖలో ఈ జోన్‌కు చెందిన వారికి పదోన్నతి అవకాశాలు పూర్తిగా కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గత సంస్కరణల్లోనే అప్పటికే ఉన్న 26 సర్కిళ్లతో పాటు రెండు లేదా మూడు కొత్త సర్కిళ్లను కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. తద్వారా ఒంగోలు నగరం కేంద్రంగా జాయింట్ కమిషనర్ (జేసీ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో గుంటూరులో ఉన్న అప్పీలేట్ కార్యాలయాన్ని తిరుపతికి తరలించారని చెప్పారు. దీంతో జోన్–3 వ్యాపారులు అప్పీళ్ల పనుల కోసం సుదూర ప్రాంతమైన తిరుపతికి వెళ్లాల్సి వస్తుందని, వ్యాపారులు వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విషయమై సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడి ఒంగోలులో రీజినల్ కార్యాలయం, అప్పీళ్ల కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అసోసియేషన్ నాయకులు కొప్పోలు సుధాకర రావుతోపాటు నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎల్.నరిసింహారావు, కార్యదర్శి పైనం మల్లికార్జునరావు, తిరుమలా దేవీతో పాటు సిబ్బంది ఉన్నారు.

కంటైనర్ లారీని ఢీకొట్టిన టిప్పర్

- లారీ చక్రాల కింద పడి ఒకరు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో కంటైనర్ లారీ, టిప్పర్



రమేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: రోడ్డు పక్కన నిలిచి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి గ్రానైట్ లోడ్ టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం సోమవారం తెల్లవారుజామున టంగుటూరు మండలంలోని తూర్పునాయుడు పాలెం వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నుంచి తిరుపతికి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్‌కే ట్రావెల్స్ బస్సును అర్ధరాత్రి దాటిన తర్వాత అదే మార్గంలో వెళ్తున్న కంటైనర్ లారీ తూర్పునాయుడుపాలెం సమీపంలో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలను రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్లు వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో పలువురు ప్రయాణికులు బస్సు దిగి కంటైనర్ ముందు భాగంలో నిల్చుని ఉన్నారు. అదే సమయంలో చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు గ్రానైట్ రాళ్ల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ రోడ్డు పక్కన నిలిచి ఉన్న కంటైనర్ లారీని బలంగా ఢీకొట్టింది. కంటైనర్ లారీ 10 అడుగుల మేర ముందుకు దూసుకెళ్లడంతో అక్కడ నిల్చుని ఉన్న బల్లికురవ మండలం వేమవరం గ్రామానికి చెందిన కొక్కెర రమేష్(41) లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మరో వాహనంలో జీజీహెచ్‌కు చేర్చారు. వరుస ప్రమాదాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.